ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబర్ 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





మహిళలపై పెరిగిన దాడులు

- తగ్గని అత్యాచారాలు, లైగింక వేధింపులు
- నేరాలు తగ్గినా తగ్గని నేర ప్రవృత్తి
- భారీగా రౌడీషీటర్లు పెరుగుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లాలో గత ఏడాది కాలంలో సాధారణ నేరాలు తగ్గినా అత్యాచారాలు, మహిళలపై దాడులు, బాలికలపై లైగింక వేధింపులు,దాడులు పెరిగాయి.

జిల్లాలో మోసాలు, రోడ్డు ప్రమాదాలు గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కొనసాగాయి. నేరాల సంఖ్య తగ్గినా నేర ప్రవృత్తి కొనసాగుతోంది.

రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్స్ సంఖ్య గణనీయంగాపెరిగింది. 2021లో రౌడీ షీటర్లు 131మందిపై ప్రారంభించగా అప్పటికి జిల్లాలో 1040 మంది ఉన్నారు. 2022లో 295 మందిపై రౌడీషీట్ తెరిచారు. వీరితో ఈ సంఖ్య 1335కి పెరిగింది. 2023లో నవంబరు వరకు 270 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేయగా జిల్లాలో మొత్తం రౌడీషీటర్ల సంఖ్య 1605 మందికి చేరింది.

సస్పెక్ట్ షీట్స్ సంఖ్య 2021కి 1532 మందిపై ఉండగా 2022కి ఈ సంఖ్య 1986కి పెరిగింది. ఈఏడాది 557మందిపై సస్పెక్ట్ షీట్స్ ప్రారంభించగా మొత్తంగా వీరి సంఖ్య 2543కి చేరింది. వీరి సంఖ్య భారీగా పెరగడం ద్వారా నేరప్రవృత్తి పెరుగుదలకు అద్ధం పడుతోంది. ప్రధానంగా మహిళలు, చిన్నారులపై దాడులు, అత్యాచారాల పెరుగుదలకు ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. సైబర్ నేరాలల్లో రికవరి శాతం బాగా తక్కువగాఉంటోంది. 2021లో 241 కేసుల్లో కేవలం 11 కేసులు

▶ 2లో

జిల్లాలో గత మూడేళ్లలో జరిగిననేరాల వివరాలు (2023 నవంబరు వరకు)

నేరాలు	2021	2022	2023
మొత్తంకేసులు	11,987	9607	8017
ఆస్తి కోసం	48	46	29
హత్యలు	54	38	45
రేప్‌లు	86	92	101
పోక్సో	86	92	153
పిల్లల కిడ్నాప్‌లు	46	28	24
మహిళలపైదాడులు	1338	1761	1496
ఎస్‌సి,ఎస్‌టి కేసులు	137	169	131
మోసాలు	957	1001	716
రోడ్డు ప్రమాదాలు	407	396	323
మృతులు	431	422	341
ప్రమాదాలు	640	688	635
క్షతగాత్రులు	913	1014	907
సైబర్ నేరాలు	241	349	33

పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం : ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్

జిల్లాలో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. గుంటూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని తరగతుల నేరాలు తగ్గాయని తెలిపారు. దోపిడీ, దొంగతనాలకు సంబంధించి రూ.9,92కోట్లు ఆస్తి పోయినట్టు ఫిర్యాదులు అందగా ఇప్పటి వరకు రూ. 5.38 కోట్లు రికవరీచేసినట్టు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



ఎన్‌టిఆర్ రంగస్థల అవార్డును అందుకుంటున్న మీగడ రామలింగస్వామి

ముగిసిన నాటకోత్సవాలు

- విజేతలకు నంది అవార్డులు ప్రదానం
- చప్పట్లతోనే కళాకారులకు తృప్తి : మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో వారం రోజుల పాటు జరిగిన నంది నాటకోత్సవాలు విజయవంతం అయ్యాయి. నాటకోత్సవాల్లో భాగంగా వారం రోజుల్లో 38 ప్రదర్శనలు చేశారు. శుక్రవారం విజేతలకు 73 స్వర్ణ, రజిత, కాంస్య నందుల ప్రదానం చేశారు. ఎన్‌టిఆర్ రంగస్థల, డాక్టర్ వైఎస్‌ఆర్ రంగస్థల పురస్కారాలను మంత్రి అంబటి రాంబాబు అందచేశారు. ఎన్‌టిఆర్ రంగస్థల అవార్డు-2022ను విశాఖపట్నంకు చెందిన ప్రముఖ రంగస్థల నటులు, రచయిత డాక్టర్ మీగడ రామలింగ స్వామికి ప్రదానం చేయడంతోపాటు గజమాలతో సన్మానించి జ్ఞాపిక, రూ.లక్షన్నర చెక్కు అందించారు. డాక్టర్ వైఎస్‌ఆర్ అవార్డు-2023 కాకినాడకు చెందిన యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ప్రతినిధులను గజమాలతో సన్మానించి జ్ఞాపిక, రూ.5 లక్షల చెక్కు అందించారు. సినీయర్ నాటక కళాకారులు కెఎస్‌కె సాయిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ కళలలో నాటక రంగం మొదటిదని, ఈ రంగంలో విజయవంతమైన వారు సినిమాల్లోను విజయాలు సాధిస్తారని అన్నారు. నాటకాల ప్రదర్శన చాల కష్టతరమైనదని, మంచి సందేశాన్ని అందించే నాటకాలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సంక్షిప్త రూపంలో ప్రదర్శిస్తున్నారని చెప్పారు. సినిమాల్లో, టీవీలో నటించేవారు డబ్బు సంపాదిస్తారని, నాటకం రంగంలో డబ్బులు పోగొట్టుకున్న నటీ, నటీనటులే ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. నాటక కళాకారులకు డబ్బు కంటే

▶ 2లో



నరసరావుపేటలో

పన్నులు పెంచినవారు జీతాలు పెంచలేరా?

- కార్మికుల కాళ్లు కడిగి కడుపులు మాత్రం మాడుస్తున్నారు
- ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికులు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక శుక్రవారం సమ్మె 4వ రోజుకు చేరుకుంది. గుంటూరు, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపట సమ్మె శిబిరాల్లో కార్మికులు ఉరితాళ్లు తగిలిచించుకుని నిరసన తెలిపారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన

▶ 2లో



గుంటూరులో



నరసరావుపేటలో రామ్‌గోపాల్‌వర్మ దిష్టిబొమ్మ దహనం

అంగన్‌వాడీల రిలే దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరింది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో రిలేదీక్షలను ప్రారంభించగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సమ్మె శిబిరాన్ని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిస్టి సందర్శించి సంఘీభావం తెలపగా శిబిరం నుండి ఆర్‌డిఒ

▶ 2లో



గుంటూరులో దీక్షలు

మామిళ్లపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారంలో భాగంగా పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు స్టాళ్లను ఏర్పాటు చేసి పంట పొలంలో రసాయనాలు వెదజల్లెందుకు ఉపయోగించే అత్యాధునిక డ్రోన్ ప్రదర్శన, గ్యాస్ కనెక్షన్లకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ఆరోగ్య శాఖ ఆయుష్మాన్ భారత్, టీబీ స్క్రీనింగ్, ఎలిమినేషన్, నెహ్రు యువకేంద్రం, గ్రామ వార్డు సచివాలయ శాఖ మై భారత్ వాలంటీర్ ఎన్రోల్మెంట్ ఆధార్ క్యాంప్, వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు, ప్రకృతి వ్యవసాయంపై ప్రదర్శనలు ఏర్పాటు చేయగా వాటిని మంత్రి పరిశీలించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ పీయంజేవై కార్డు ద్వారా గాని, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డు ద్వారానైనా గాని వైద్య చికిత్సలు ఉచితంగా అందుతాయని చెప్పారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరు బాగుందని, వైద్య రంగం అభివృద్ధికి కేంద్ర

▶ 2లో



చెక్కు అందిస్తున్న కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

నేడు బిసి యువజన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఎన్‌జివో కాలనీ 4వ లైనులో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన సంఘం నూతన కార్యాలయాన్ని శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్టు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు నాని తెలిపారు. ఎన్‌జివో కాలనీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్యాలయం ప్రారంభోత్సవానికి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, ఎమ్మెల్సీలు ఎల్.అప్పిరెడ్డి, పోతుల సునీత, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో బిసిలపై దాడులు జరిగినా, ప్రభుత్వ యంత్రాంగంతో సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బిసిలకు అన్ని పార్టీలు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. బిసిల కోసం ఆర్.కృష్ణయ్య 50 ఏళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నారని, ఆయన సూచనల మేరకు రాష్ట్ర కార్యాలయాన్ని గుంటూరులో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జాతీయ యువజన సంఘం అధ్యక్షులు లీలా వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షులు పద్మావతి పాల్గొన్నారు.

మాత శిశు సంరక్షణ కేంద్ర పనులు వేగవంతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని మాత శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణ పనులు జింకాన సహకారంతో త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఎంసిహెచ్ అయిదో అంతస్తు స్లాబ్ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎంసిహెచ్ బ్లాక్ జి ప్లస్ ఏడు ఫ్లోర్లను రెండు లక్షల 80 చదరపు విస్తీర్ణంలో పనులు జరుగుతున్నాయని చెప్పారు. మరో రెండు ఫ్లోర్ల పనులు కూడా రానున్న రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. జింకానా సహకారంతో రూ.వంద కోట్ల పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఎంసిహెచ్ బ్లాక్ సౌత్ ఇండియాలోనే ఎక్కడ లేని విధంగా సిద్ధం చేస్తున్నామని, ఈ బ్లాక్ పూర్తయితే 600 పడకలు అందుబాటులో వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందని కొత్త సమస్యలను తీసుకుని రావాల్సిన అవసరం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జయధీర్‌బాబు ఎన్నికైన సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వైద్యులకు అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. అనేకమంది అడిషనల్ డిఎంఇ హోదాను వదులుకుంటున్నారని, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ జయధీర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి అండగా నిలబడతామని అన్నారు. వైద్యుల సమస్యలుంటే చర్చల ద్వారా సాధించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.



డాక్టర్ జయసుధీర్‌బాబును సత్కరిస్తున్న సూపరింటెండెంట్

అంగన్‌వాడీల రిలే దీక్షలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం వరకూ ప్రజా సంఘాలు ప్రదర్శనగా వెళ్లి ఆర్‌డిఒకు విన్నవించాయి. అంగన్వాడీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ దిష్టిబొమ్మను శిబిరం వద్ద దహనం చేశారు. గుంటూరులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, టిడిపి నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సోమి శంకరరావు తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు. ఎల్.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సమ్మె చేసే హక్కు ఉందని, ప్రభుత్వంపై సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి, సమ్మె విరమణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే వేతనాలు పెంచుతామని గత ఎన్నికలప్పుడు హామీఇచ్చిన వైసిపి ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పుడున్న ధరలతో పోల్చితే అంగన్‌వాడీల జీతాలు కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవని, కావున వేతనాలు పెంచాలని కోరారు. బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా, సమ్మెను విచ్ఛిన్నం చేయానికి అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. సమ్మె శిబిరానికి అధ్యక్షత వహించిన అంగన్‌వాడీ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం చేస్తే సమ్మె అంత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం పట్టువీడి సమస్యలు పరిష్కరించాలన్నారు. దీక్షల్లో టి.రాధ, చిన్న వెంకాయమ్మ, మెర్సీ, పద్మ, వేదవతి, శ్రీదేవి, రోజమ్మ, రమాదేవి కూర్చున్నారు.



నరసరావుపేటలో ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. కనీస వేతనాలు అమలుతోపాటు గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు కల్పించాలని అంగన్వాడీలు పదేపదే విన్నవిస్తున్నా, ఆందోళనలు చేస్తున్నా పాలకుల్లో చలనం ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సమ్మె శిబిరం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇచ్చారు. మార్గం మధ్యలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లతో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, కేంద్రాల తాళాలు పగలగొట్టి ఇతర ఉద్యోగుల ద్వారా నడిపించాలనే ప్రభుత్వ యత్నాలను అడ్డుకుంటామని చెప్పారు. తొలుత గాంధీపార్కు వద్ద దీక్ష శిబిరాన్ని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిస్టి సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అంగన్వాడీలు అందిస్తున్న సేవల విలువను ప్రభుత్వాలు గుర్తించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ బెదిరింపులను అధిగమించి అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి మాట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించాలన్నారు. సర్వీసులో చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జిలు పెంచాలని, బకాయిలను విడుదల చేయాలని కోరారు. సరుకులు ఒక యాప్ ద్వారా మాత్రమే నిర్వహించే విధంగా చేయాలన్నారు. ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మద్దతు తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తుందని చెప్పారు. ప్రతిపక్ష నేతగా అనేక హామీలను ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సమస్యలేమీ పట్టించుకోకుండా రూ.కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కెపి మెటిల్డాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, వివిధ సంఘాల నాయకులు డి.శివకుమారి, ఏపూరి గోపాలరావు, కె.రామారావు, సిలార్ మసూద్, వెంకటేశ్వరరాజు, రవిబాబు, టి.శ్రీనివాసరావు, వెంకట్, రంగయ్య, శోభారాణి పాల్గొన్నారు.

పన్నులు పెంచినవారు జీతాలు పెంచలేరా?

(మొదటి పేజీ తరువాయి)

కార్యాయం ఎదుట సమ్మె శిబిరాన్ని సిఐటియు గుంటూరు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అపార్ట్‌మెంట్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆది నికల్సన్, ఆవాజ్ నగర అధ్యక్షులు షేక్ సైదా, ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ ఖాసీం షహిద్ సందర్శించి మద్దతు తెలిపారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ పెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు ప్రసంగించారు. నరసరావుపేట సమ్మె శిబిరంలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్, గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడారు. కార్మికుల పట్ల ప్రభుత్వ తీరు దారుణంగా ఉందన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతుగా మాట్లాడారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేస్తున్న పనులకు పొంతనలేదన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన లెక్కల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్లలో మున్సిపాల్టీల్లో పన్నులు 60 శాతానికిపైగా పెంచారని చెత్త పన్ను కూడా వసూలు చేస్తున్నారని, కార్మికుల జీతాలు మాత్రం పెంచడానికి చేతులు రావడం లేదని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికుల కోరికలు న్యాయంగా కనిపించి ఇప్పుడు మాత్రం అన్యాయంగా తోస్తున్నాయా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మోసం చేసిందని.. తాము అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేస్తామని హామీచ్చినవారు అధికారంలోకి వచ్చాక విస్మరించడం మరోమోసంమేనని అన్నారు. పారిశుధ్య కార్మికుల కాళ్లు కడికిన ప్రభుత్వాధినేతలు కడుపులు మాత్రం మాడుస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కనీస వేతనాలు, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్త్, రిస్క్ అలవెన్స్ వంటి సమస్యల పరిష్కారానికి రాతపూర్వకంగా హామీనివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ ఒకప్పుడు హామీలిచ్చిన వారు ఇప్పుడు బెదిరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమ్మెకు తాము పూర్తి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో డి.యోహాను, టి.మల్లయ్య, పి.యేసు, దీనమ్మ, మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన నాటకోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రేక్షకులు కోట్టే చప్పట్లే గౌరవాన్ని ఇస్తాయన్నారు. ప్రజలను ఆకట్టుకునేలా రాజకీయ నాయకులు ప్రసంగాలు చేయాలన్నా మాడ్యులేషన్‌తో మాట్లాడే నాటకరంగంలో అనుభవం తప్పనిసరి అని చెప్పారు.

రాష్ట్ర చలనచిత్ర టివి, నాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి మాట్లాడుతూ కరోనా కారణంగా రెండున్నరేళ్లు ఇబ్బంది ఉండటంతో తొలుత నాటక రంగానికి సంబంధించి నంది నాటకోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. నంది నాటకోత్సవాల్లో అర్హతున్న వారికే నంది బహుమతులు అందించేందుకు నిష్ణాతులైన న్యాయనిర్ణేతలను నియమించటంతో పాటు వారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చామన్నారు. నాటక ప్రదర్శనలలో అత్యుత్తమమైనవి ఎంపిక చేయటానికి, ఎన్‌టిఆర్, డాక్టర్ వైఎస్ఆర్ రంగస్థల పురస్కారాల ఎంపికకు ప్రపంచంలోనే ఎప్పుడు లేని విధంగా 27 మంది న్యాయనిర్ణేతలను నియమించామని చెప్పారు. విజేతల ఎంపికలో ఎక్కడైనా పొరపాటుంటే చొక్కా పట్టుకుని నిలదీయాలనీ, లై డిటెక్టర్ పరీక్షకు సైతం తాను సిద్ధంగా ఉన్నాని అన్నారు. పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నందినాటకోత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన 115 ఎంట్రీలను ప్రాథమికంగా సెప్టెంబరులో పరిశీలించి వాటిలో పద్య నాటకం, సాంఘిక నాటకం, సాంఘిక నాటిక, బాలల నాటిక, విశ్వవిద్యాలయ, కళాశాల నాటిక విభాగాల్లో 38 నాటకాలను తుది పోటీలకు ఎంపిక చేశామని వివరించారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన వారికి, వివిధ కమిటీల బాధ్యతలు నిర్వహించిన అధికారలు, ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. పద్య నాటకాల్లో మాధవవర్మ, శ్రీకాంత కృష్ణమాచార్య, వసంత రాజీయం, సాంఘిక నాటకాల్లో ఇంద్రప్రస్తం, ఇంపోస్టర్స్, కలనేత, సాంఘిక నాటికల్లో ఆస్థికలు, కమనీయం, చీకటి పువ్వు, బాలల నాటికలలో ప్రపంచ తంత్రం, బాధ్యత, మూడు ప్రశ్నలు యూనివర్సిటీ/కాలేజి నాటికలలో 'ఇంకానా', కపిరాజు, ఉద్ధం సింగ్ ఎంపికయ్యాయి. ప్రథమ స్వర్ణ నంది, ద్వితీయ రజత నంది, తృతీయ కాంస్య నందులను పోసాని కృష్ణమురళీ, విజయ్ కుమార్‌రెడ్డి అందించారు.

మహిళపై పెరిగిన దాడులు

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమేపరిష్కరించారు. 2022లో 349 కేసులకు గాను కేవలం 17 కేసుల్లో, 2023లో 283 కేసులకు గాను కేవలం 33 కేసుల్లోనే పరిష్కారించి సొమ్మును కొంతమేరకు రికవరీ చేయగలిగారు. జిల్లాలో నకిలీ మద్యం, మద్యం అక్రమ వ్యాపారంపై కేసులు యథాతథంగా కొనసాగాయి. గంజాయి కేసులు కూడా పెద్దసంఖ్యలో నమోదు అయ్యాయి. ఈఏడాది 585 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 1.28 లీటర్ల లిక్విడ్ గంజాయిని కూడా పట్టుకున్నారు. జిల్లాలో గంజాయి విక్రయాలు పెరిగాయి. యువత గంజాయి బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. మద్యంవిక్రయాలపై నియంత్రణ లేకుండాపోయింది. ఎక్కడబడితే అక్కడ మద్యం సేవిస్తూ మందుబాబు ప్రజలకుతీవ్ర అసౌకర్యాన్ని కల్గిస్తున్నారు. బార్లలో ధరలు భారీగా పెంచడం వల్ల ఎక్కడ కొద్దిగా స్థలం కన్పిస్తే అక్కడే తాగడం వల్ల పలు చోట్ల శాంతి భద్రతల పరిస్థితి ఏర్పడుతోంది.

మామిళ్లపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైద్య రంగంలో తెచ్చిన విప్లవాత్మకమైన మార్పుల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా రూ.17 వేల కోట్లతో ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.8,500 కోట్లతో 11 మెడికల్ కళాశాల నిర్మాణాలు చేపట్టామన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుపై రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కేన్సర్ లాంటి వ్యాధులకు పరిమితి లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్‌రావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణబాబు, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల శాఖ అధికారిణి కోమలి పద్మ, జాతీయ లేబర్ బోర్డు ఛైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ, తహశీల్దార్ శ్రీకాంత్ కేధార్‌నాథ్, ఎంపిడిఒ శ్రీనివాస్, సర్పంచ్ జె.యానాదిరావు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రమాణాలు మరింత పెంచాలి

ప్రజాశక్తి-గుంటూరు :రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అకడమిక్, ఎస్టాబ్లిష్మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలలో నాణ్యమైన పురోగతి తప్పనిసరి అని రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని 50 పాఠశాలలు, 10 జూనియర్ కళాశాలలో, 1 డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుల వార్షిక శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మొత్తంగా రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలో ప్రమాణాలు గర్వించదగ్గ స్థాయిలో ఉన్నాయని, అయినా ప్రధానాచార్యులు మరింతగా అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న విద్యా విధానాలను పాలనా సంస్కరణలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలపై పట్టు సాధించి మరింతగా గురుకుల విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా గతేడాది నూరు శాతం ఫలితాలు సాధించిన 20 మంది ప్రధానాచార్యులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ ఉబేదుల్లా, ప్రాంతీయ ఉప కార్యదర్శి ఎం సురేష్‌బాబు, ఉప కార్యదర్శి పిఎల్ మల్లేశ్వరి, సహాయ కార్యదర్శి సుమభాను, గురుకుల విద్యాలయాల బోధన సిబ్బంది సంఘ అధ్యక్షులు సుధాకర్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మురళికష్ణ, డాక్టర్ పివి మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు

అభివృద్ధి ముసుగులో నిధులు దుర్వినియోగం

వైసిపి, టిడిపి కౌన్సిలర్ల పరస్పర ఆరోపణలు - తీవ్ర వాదోపవాదాల మధ్య ముగిసిన కౌన్సిల్

ప్రజాశక్తి-తెనాలి

అభివృద్ధి పేరిట నిధుల దుర్వినియోగమంటూ టిడిపి, అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ వైసిపి..ఇలా అధికార, ప్రతిపక్ష నేతల వాగ్వివాదం, ఓ దఫా వాయిదాతో ఎట్టకేలకు కౌన్సిల్ సమావేశం ముగిసింది. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శుక్రవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. బడ్జెట్ కేటాయింపులతో కూడిన అజెండా అంశాలు చదువుతుండగా టిడిపి కౌన్సిలర్ అన్నం పిన్నారావు లేచి విఎస్సార్ కళాశాల వద్ద తెనాలి బండ్, దాని సుందరీకరణ పేరిట రూ.40లక్షలు కేటాయించటం కంటే అంతకంటే ముఖ్యమైన సమస్యలపై ఆ నిధులను వెచ్చించవచ్చు కదా అంటూ ప్రశ్నించారు. అదే సమయంలో కౌన్సిల్ ప్రతిపక్ష నేత పసుపులేటి త్రిమూర్తి జోక్యం చేసుకుని తెనాలి బండ్‌పై విగ్రహాల ఏర్పాటుకు అనుమతులున్నాయా అంటూ ప్రశ్నించారు. దీంతో వైసిపి కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, మొఘల్ రహ్మత్ భేగ్ జోక్యం చేసుకుని అభివృద్ధికి నిధుల కేటాయింపును అడ్డుకుంటారా? టిడిపి హయాంలో మార్కెట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏ అనుమతితో ఏర్పాటు చేశారని వాగ్వివాదానికి దిగారు. చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వారించటంతో వారి మధ్య వివాదం సద్దుమణిగింది. అజెండాలోని 14 వ అంశం చదువుతుండగా టిడిపి కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వర రావు లేచి రణరంగ చౌక్ స్థలం కేవలం పదిగజాలు కూడా ఉండదని దానికి రూ.25 లక్షలు ఎలా వెచ్చిస్తారని ప్రశ్నించారు. మరలా వైసిపి కౌన్సిలర్లు మొఘల్ రహ్మత్ భేగ్, దుబాయ్‌బాబు జోక్యం చేసుకుని స్వాతంత్రోద్యమంలో ప్రాణాలర్పించిన మహనీయుల స్థూపాలున్న ప్రాంతం అభివృద్ధిపైనా ఆంక్షలేనా అంటూ మండిపడ్డారు. అదే సమయంలో అధికార పార్టీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి కూడా జోక్యం చేసుకుని టిడిపి హయాంలో 30వ వార్డులో ఒక సెంటు స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.1.20కోట్లు వెచ్చించారని, అదే కమ్యూనిటీ హాలు పై అంతస్తు కేవలం రూ.18లక్షలతోనే వైసిపి హయాంలో నిర్మించామని, దోచుకోవటం టిడిపికే అలవాటంటూ ఆరోపించారు. దీంతో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం, గందరగోళం నెలకొన్న నేపథ్యంలో చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని అజెండా చదవాల్సిందిగా పురమాయించారు. చర్చ జరుగుతుండగా అజెండా ఎలా చదువుతారంటూ టిడిపి సభ్యులు పోడియం వద్దకు దూసుకొచ్చారు. ఇరుపక్షాలు దాదాపు తోపులాటకు దిగినంత పని చేశారు. ఈ పరిణామాల మధ్య చైర్‌పర్సన్ పదినిముషాలపాటు సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి సమావేశం కాగానే అజెండా అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. టిడిపి వ్యతిరేకించిన అంశాలపై వారు చైర్‌పర్సన్‌కు డిసెంట్ ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జస్వంతరావు, ఎంఈ కె.నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


పోడియం వద్ద సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం


చైర్‌పర్సన్‌కు డిసెంట్ ఇస్తున్న టిడిపి సభ్యులు

ఇంజినీరింగ్ విభాగంపై అధికార పక్షం విమర్శలు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తే, ఆ నిధులు వెచ్చించి పనులు చేయటంలో ఇంజనీరింగ్ అధికారులు జాప్యం చేస్తున్నారని వైసిపి కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయిల్, దాసరి వీరవసంతరావు ఆరోపించారు. ఇంజనీరింగ్ విభాగంలో ప్రక్షాళన అవసరమంటూ వ్యాఖ్యానించారు. పనులు చేయాల్సిన ప్రాంతాన్ని కూడా అధికారులు పరిశీలించకుండా, కేవలం సచివాలయం సిబ్బందితో అంచనాలు వేయిస్తున్నారని ఆరోపించారు. 14వ వార్డులో ఓ పనికి రూ.7లక్షలు అంచనా వేశారని, అయితే కేవలం రూ.3లక్షలతోనే ఆ పని పూర్తి చేయించినట్లు ఆ వార్డు కౌన్సిలర్ వీర వసంతరావు చెప్పారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు జాప్యం వీడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సభ్యుల ఆరోపణల్లో వాస్తవాలను ఇంజనీరింగ్ విభాగం గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని చైర్ పర్సన్ ఆదేశించారు.

ఎ1 బేకరీల్లో నూతన సంవత్సర ఆఫర్లు

ప్రజాశక్తి-గుంటూరు



నగరంలోని ఎ1 అబ్బాస్ బేకరీలలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు బేకరీ ప్రొప్రైటర్ ఎండి.అబ్బాస్ తెలిపారు. 2/18 బ్రాడీపేటలోని ప్రధాన బ్రాంచ్‌తోపాటు, కొత్తగా రాజేంద్రనగర్ రెండో లైనులో ఐకాన్ మాల్ ఎదురు నూతనంగా ఏర్పాటు చేసిన మరొక బ్రాంచ్‌లో కూడా ఈ ఆఫర్లు ఉంటాయని, వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31, జనవరి 1వ తేదీన ఒక కేజీ కూల్ కేక్ కొన్న వారికి ఒక బిర్యాని, హాఫ్ కేజీ కొన్న వారికి కూల్‌డ్రింక్ బాటిల్ ఉచితంగా అందిస్తున్నట్లు అబ్బాస్ తెలియజేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన రాజేంద్రనగర్‌లో బ్రాంచిలో ఆసక్తి ఉన్న వారికి కేకుల తయారీలో శిక్షణ ఇస్తామని చెప్పారు. అలాగే ఆసక్తి ఉన్న వారికి ఫ్రాంచైజీలు ఇస్తామని వెల్లడించారు. వేడుక ఏదైనా, పండుగ ఏదైనా సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో, నాణ్యతలో రాజీలేకుండా వివిధ రకాల కేకులను అందిస్తున్నట్లు వివరించారు. .


కేలండర్ ఆవిష్కరిస్తున్న జేసీ రాజకుమారి

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు : ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ 2024 టేబుల్ క్యాలెండర్ శుక్రవారం జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులకు జేసీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.రాజశేఖర్, కోశాధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షులు ఎస్‌పిఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్.కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎస్ఐగా కానిస్టేబుల్ ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



ఇటీవల ఎస్ఐ పోస్టులకు జరిగిన ఎంపికల్లో గుంటూరుకు చెందిన కానిస్టేబుల్ ఎస్ఐగా ఎంపికయ్యారు. పోలీసు కంట్రోలు రూమ్‌లో పనిచేస్తున్న ఎన్.వెంకట సుబ్బారెడ్డి ఎస్ఐగాఎంపిక కావడంపై ఉన్నతాధికారులు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. ఎస్పి ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ 2013లో పోలీసుశాఖలో ఎఆర్ కానిస్టేబుల్‌గా చేరాడు. 2018లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక అయ్యారని తెలిపారు. అదనపు ఎస్పిలు సుప్రజ, శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు, కంట్రోలు రూమ్ సిఐ శివ ప్రసాద్, స్పెషల్ బ్రాంచి డిఎస్‌పి రత్నస్వామి, స్పెషల్ బ్రాంచ్ సి ఐలు రాజశేఖరరెడ్డి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కోరారు. శుక్రవారం నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులందరి క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేసి, వారికి పిఆర్‌సి 2020స్కేల్ వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ ఇచ్చి సుప్రీం కోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరిముల్లా, షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, రాధాకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేరేచర్లలో యువకుడు ఆత్మహత్య


కోడెల శివరాం వేధింపులే కారణమని మృతుని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి- మేడికొండూరు

తన కుమారుడు ఆత్మహత్యకు కోడెల శివరాం కారణమని మృతుని తల్లి కొల్లోజు నాగమణి ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదుచేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పేరేచర్లకు చందిన మృతుడు ఫణీంద్ర సాయి (22) గుంటూరు కోడెల శివరాంనకు చెందిన డిమార్ట్‌లో పనిచేస్తాడు. ఆర్థిక అంశాలను కూడా అతనే చూస్తాడని తెలిపారు. ఈ క్రమంలో పని వత్తిడితో అనారోగ్యంతో ఫణీంద్ర ఇంటివద్ద ఉన్నాడు. కోడెల శివరాం అనుచరులు ఫణీంద్రను డ్యూటీకి రావాలని హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన ఫణీంద్ర సాయిబాబ గుడివద్ద తన ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రాత్రి సమయమైన ఇంట్లో నుంచి బయటికి రావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు పగలగొట్టి చూసేసరికి లోపల ఫణీంద్ర సాయి మృతి చెంది తాడుకు వేలాడుతూ ఉన్నాడు. కేసు నమోదు అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పట్టు వదలని అంగన్వాడీలు

18వ రోజుకు సమ్మె - శిబిరాల్లో రిలేదీక్షలు - సత్తెనపల్లిలో సొమ్మసిల్లి పడిపోయి కూడా దీక్షను కొనసాగించిన కార్యకర్త - పోరాటానికి పలు పార్టీలు, సంఘాల సంఘీభావం - అంగన్వాడీలను అనుచితంగా మాట్లాడిన వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు క్షమాపణలు చెప్పాలని డిమాండ్


వినుకొండలో దీక్షలు విరమింపజేస్తున్న జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వినతి పత్రం ఇచ్చేందుకు శాంతియుతంగా వెళ్లిన అంగన్వాడీలను వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దూషించడంతోపాటు అతని అనుచరులతో దాడి చేయించారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 18 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా పట్టణంలోని సురేష్ మహల్ వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని జీవీ ఆంజనేయులు శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. రిలేదీక్షను నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు విని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత గల ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. దీనిపై సిఎం సైతం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీలకు ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో టిడిపి నాయకులు పివి సురేష్‌బాబు, బి.గోవిందరాజులు, జానీ, జిమ్ జానీ, కె.వెంకట కోటేశ్వరరావు ఉన్నారు.

ఇదిలా ఉండగా సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సమ్మె శిబిరంలో రిలేదీక్షలు చేశారు. వీరికి హ్యూమన్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు నాగమణి, కార్యదర్శి కోలా స్వాతి మద్దతు తెలిపారు. ఎఐటియుసి నాయకులు ఎ.మారుతి వరప్రసాద్, సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎ.ఆంజనేయులు, బి.కోటయ్య, శారమ్మ, అంగన్వాడీ నాయకులు లక్ష్మీ ప్రసన్న, మున్ని, పి.ఉమాశంకరి, కృష్ణకుమారి, జి.పద్మ, శ్రీదేవి, యేసు మాణిక్యం, నిర్మలమ్మ, జయ సూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎంకు ఉత్తరాలు రాసి ఆ కార్డులను పోస్టుబాక్సులో వేశారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక సమ్మె శిబిరాన్ని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిస్టి సందర్శించి మద్దతుగా మాట్లాడారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలరని, అంగన్వాడీల పోరాటానికి తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటి అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్లతోపాటు పెన్షన్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా అంగన్వాడీలు సమ్మె శిబిరంలో రిలేదీక్షలు చేశారు. సిఎంకు నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నాయకులు బి.వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు, అంగన్వాడి నాయకులు షేక్ హజ్రా, శాంతమణి, శివరంజని, కవిత, అరుణ, జయశ్రీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలను రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.నరసింహారావు ప్రారంభించి మాట్లాడారు. సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం మండలాలకు చెందిన 20 మంది అంగన్వాడి రిలేదీక్షల్లో కూర్చున్నారు. రెంటపాళ్ల అంగన్వాడీ టీచర్ మంజుల రాణి నిరసంతో సొమ్మసిల్లి పడిపోవడంతో శిబిరంలోని వారు ఆందోళనకు గరయ్యారు. అయినా ఆమెమాత్రం పట్టువదలకుండా దీక్షను కొనసాగించారు. దీక్షలను సాయంత్రం డివైఎఫ్ఐ నాయకులు జడ రాజకుమార్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అప్పుడు నిమ్మరసం తాగిన మంజూలవాణి నిమ్మరసం తాగి కొద్దిసేపటికి సాధారణ స్థితికి చేరుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.మహేష్, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జి.సుజాత, ఎం.అహల్య, అంగన్వాడీలు పాల్గొన్నారు.


పిడుగురాళ్ల దీక్షల్లో సంఘీభావంగా మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి


అమరావతి శిబిరంలో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


సత్తెనపల్లి సమ్మె శిబిరంలో సొమ్మసిల్లిన కార్యకర్త


మాచర్లలో విగ్రహం వద్ద కొంగుచాచి విన్నవిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

18వ రోజు సమ్మె శిబిరాన్ని స్థానిక గ్రంథాలయం వద్ద యూనియన్ అధ్యక్షులు జి.సావిత్రి, ప్రజా సంఘాల నాయకులు ఎం.విల్సన్, ఎస్.బాబు ప్రారంభించారు. రిలేదీక్షల్లో కూర్చున్న అంగాన్వాడీలకు పూలమాలలేశారు. జి.సావిత్రి మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం, అధికారులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని, అయినా అంగన్వాడీలు ఐక్యంగా పోరాడుతున్నారని చెప్పారు. ఎప్పటికైనా ప్రభుత్వం దిగిరాక తప్పదని, అప్పటి వరకూ సమ్మె కొనసాగించి తీరుతామని ఉద్ఘాటించారు. సాయంత్రం దీక్షలను సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

ప్రజాశక్తి - అమరావతి

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీలు మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడారు. 3వ తేదీన కలెక్టరేట్ వద్ద ఆందోళనకు అంగన్వాడీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎంత బెదిరిస్తే సమ్మె అంత ఉధృతమవుతుందని హెచ్చరించారు. సమ్మెకు జనసేన నాయకులు వాకా అఖిల్, ఆర్.సత్యనారాయణ, బి.సురేష్, ఎస్.గోపాలకృష్ణ, పి.రినేష్, కె.అరుణ్, ఎల్.వంశీ, పి.గోపినాథ్, కె.బాబీ నాయుడు, పెన్షనర్ అసోసియేషన్ నాయకులు జి.కోటేశ్వరరావు, తిమ్మయ్య, ఎన్.నాగేశ్వరరావు, మస్తాన్‌రావు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఈపూరు, బొల్లాపల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడిలు చేపట్టిన సమ్మె శిబిరం కొనసాగుతోంది. రిలే దీక్షలు చేపట్టారు.

ప్రజాశక్తి-క్రోసూరు

స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద సమ్మె శిబిరాన్ని ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాసరావు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.రామకృష్ణ, పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి సందర్శించి మద్దతుగా మాట్లాడారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి అంగన్వాడీలు కొంగుచాచి విన్నవిం వినూత్న నిరసన తెలిపారు. అంబేద్కర్ సెంటర్‌లో సమ్మె శిబిరాన్ని జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పి.హరిప్రసాదు, జి.సాంబశివరావు సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. సిఐటియు నాయకులు బి.మహేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఇందిరా, కె.పద్మావతి, కోటేశ్వరి, సుందరలీల, శారద, దుర్గా శివలక్ష్మీ, రుక్మిణి, జయలక్ష్మీ, శివపార్వతి, లీలావతి, వెంకటరమణ, సైదమ్మ, చిలకమ్మ, మల్లీశ్వరి, జనసేన నాయకులు టి.శ్రీనివాసరావు, బి.రామాంజనేయులు పాల్గొన్నారు.




క్రోసూరు


చిలకలూరిపేట

మెడకు ఉరితాళ్లతో మున్సిపల్ కార్మికులు

4వ రోజు కొనసాగిన సమ్మె - పలువురు మద్దతు


పిడుగురాళ్ల

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఉరితాళ్లతో నిరసన తెలిపారు. పిడుగురాళ్లలో సమ్మె శిబిరాన్ని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రజారోగ్యంలో కీలకమైన మున్సిపల్ కార్మికులను సమస్యలను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ కార్మికులు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగించాలని, తమ సంఘం పూర్తి మద్దతు ఉటుందని ప్రకటించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఆప్కాస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నాయకులు బి.అనిల్, టి.శ్యామ్ కోటి, కె.కొండలు, జి.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, మార్తమ్మ, సుజాత, జయేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి- దాచేపల్లి

మున్సిపల్ కార్మికులు నాలుగోరోజు సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. కార్మికులు వెంకటేష్, శామ్యూల్, శివ, రాము పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. శుక్రవారం శిబిరాన్ని యూనియన్ నాయకులు రమణ ప్రారంభించి మాట్లాడారు. అనసూయ, బి.చిన్నమ్మాయి, లక్ష్మీదేవి, డి.రమణ, ఇస్సాకు, ఆంజమ్మ, మల్లమ్మ, సుబ్బారావు, డి.వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు బి.మహేష్ పాల్గొన్నారు.


దాచేపల్లి


మాచర్ల

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు తమ మెడలకు ఉరి తాళ్లు తగిలించుకొని నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని జై భీమ్ భారత్ పార్టీ నాయకులు జె.విజయకుమార్ సందర్శించి మద్దతు తెలిపారు. డివైఎఫ్ఐ నాయకులు జె.రాజ్‌కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు వి.చంద్రకళ, సత్తెనపల్లి అధ్యక్షులు సిహెచ్ పెదవెంకయ్య మాట్లాడారు.


సత్తెనపల్లి

సమస్యలు పరిష్కరించాలని 18 రోజులుగా రోడ్డుపైనే పోరాటం

అంగన్వాడీల సమ్మెకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు

ఉరితాళ్లతో అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన వ్యక్తం చేశారు. తాడేపల్లి తహాశీల్దార్ కార్యాలయం సమీపంలో జరుగుతున్న అంగన్ వాడీ దీక్షలనుద్దేశించి అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సరళ, సబిత, పూర్ణిమ, అనూష, మాణిక్యం, మధులత, అరుణ, వరలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.



చేబ్రోలు సమ్మె శిబిరంలో పోస్టుకార్డులు చూపుతున్న పాశం రామారావు, దండా లక్ష్మీనారాయణ తదితరులు

ప్రజాశక్తి - చేబ్రోలు

18వ రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం చేబ్రోలు అంగన్వాడీ సమ్మె శిబిరాన్ని పాశం రామారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీ నారాయణ సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు అంగన్వాడీల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు.అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే, ప్రభుత్వం తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం ముఖ్యమంత్రికి రాసిన పోస్ట్ కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఫిరంగిపురం : అంగన్వాడీలు మంజుల, సన్నీ, నందిని, పి రజిని, మల్లేశ్వరి, విజయలక్ష్మి తదితరులు సమ్మె శిబిరంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి రూరల్

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె గురువారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. స్థానిక వైఎస్ఆర్ కళాసాల ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా టీచర్లు ఆయాలు ర్యాలీ నిర్వహించారు. మున్సి పల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె బాబుప్రసాద్, యూనియన్ నాయకులు ఎవిఎస్ కుమారి, షేక్ హుస్సేన్ వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

అంగన్వాడీల సమ్మెకు ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సురేష్ మద్దతు తెలిపి ప్రసంగిచారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజా రమేష్ సత్యనారాయణ,ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి నరసింహారావు, సుబ్బారావు,సాంబయ్య దానియేలు,అమతరావ్, తదితరులు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో



దుగ్గిరాలలో



మంగళగిరిలో



పెదనందిపాడులో



తాడికొండలో ఎమ్మెల్యే సుచరితకు అంగన్వాడీల వినతి



తుళ్లూరులో



తాడేపల్లిలో

ప్రజాశక్తి దుగ్గిరాల : అంగన్వాడీల నిరసన కార్యక్రమం శుక్రవారం నాటికి 18 రోజుకు చేరినది ఈ సందర్భంగా కళ్లకు గంతలు కట్టి నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం ఇవ్వాలని ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దుచేసి ఒకే యాప్ ను అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు వాణి మణెమ్మ అనిత సునీత రాజ్యలక్ష్మి రాజ కుమారి అనురాధ పార్వతి అఖిల మరియమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు లో అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం 18వ రోజుకి చేరాయి జగన్ మామ అమ్మల ఆకలి తీర్చు అంటూ చిన్నారి జెస్సి ఎర్ర జెండా పట్టుకుని చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మండల సంఘ అధ్యక్షురాలు శివకుమారి కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన నిరసన సభలో పలు గ్రామాలనుంచి అంగన్వాడీలో అధిక సంఖ్యలో పాల్గొని నినాదాలు ఇచ్చారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ,సహాయకులు రాజధాని ప్రాంతం తుళ్లూరులో శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు.దీక్షలను సీనియర్ సహాయకులు సక్కుబాయి ప్రారంభించారు.ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ప్రసంగించారు.

ప్రజాశక్తి - తాడికొండ : అంగన్వాడి కార్యకర్తలు , సహాయకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషిచేస్తానని నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. తాడికొండ వచ్చిన సుచరితకు అంగన్వాడీలు సమస్యలను వివరించారు.

ప్రజాశక్తి మంగళగిరి : అంగన్వాడీల తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం 17వ రోజు మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో అంగన్వాడీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హేమలత, జయశ్రీ, సుహాసిని, రుక్మిణి, వినీల, తిరుపతమ్మ, పి ఫాతిమా, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

అంగన్వాడి, మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మంగళగిరి : అంగన్వాడి, మున్సిపల్ కార్మికుల సమస్యల విషయంలో వెంటనే ప్రభుత్వం స్పందించి పరిష్కారం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. రామారావు తన ప్రసంగం కొనసాగిస్తూ అంగన్వాడీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా రూ.1000 వేతనం ఇస్తానని చెప్పి మాట తప్పారని అన్నారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి తమ న్యాయమైన డిమాండ్ల కొరకు చేస్తున్న నిరవధిక సమ్మెకు సిపిఎం మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే యూనియన్ నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంగళగిరి నియోజక వర్గంలో ప్రభుత్వ భూముల్లో ఇల్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. అభ్యంతరం లేని భూములను గుర్తించి వెంటనే వారికి పట్టాలు ఇవ్వాలని సమావేశం తీర్మానించినట్లుగా చెప్పారు. నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పెరుగుతున్న కార్పొరేషన్ అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. దళితులకు స్మశాన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారికి స్మశాన స్థలాలకు భూములు కేటాయించాలని అన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, జొన్న శివశంకరరావు, ఎం పకీరయ్య, పి బాలకృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎం రవి, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బి వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు బి కోటేశ్వరి, సిపిఎం తాడేపల్లి నాయకులు వి దుర్గారావు, రూరల్ మండలం నాయకులు పి కృష్ణ దుగ్గిరాల మండల కార్యదర్శి జె బాలరాజు, సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అటకెక్కించిన జగన్

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

మాట తప్పను మడమ తిప్పను అంటే గతంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అటకెక్కించడమా అని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మెడకు ఉరితాళ్లు వేసుకుని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లా డుతూ ఎంటిఎంసిలో కలిపిన విలీన గ్రామాల కార్మికులకు కూడా సమాన పనికి సమాన వేతనం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల మంత్రివర్గంతో జరిగిన చర్చల్లో ఆర్థిక విషయాలు తప్ప మిగతావి పరిశీలిస్తామని మంత్రులు చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజంగా మున్సిపల్ కార్మికుల మీద ప్రేమ ఉంటే గతంలో సిఎం చెప్పినట్లు లక్ష రూపాయలు ఇవ్వమని అడగడంలేదని, తాము రూ.26 వేలు మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. అనేక పర్యాయాలు తాము వినతిపత్రాలు ఇచ్చినా సమ్మెకు వెళ్లబోతున్నామని నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమ్మె విరమించండి, మూడు నెలల తరువాత ఆలోచిస్తామని చెప్పడం మున్సిపల్ కార్మికులను దగా చేయడమేనన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, డివి భాస్కరరెడ్డి, దశరథరామిరెడ్డి, డి.విజయబాబు, కార్మికులు కృష్ణ, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కేళి వెంకటేశ్వరరావు తదితరులు మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి తెనాలి : మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దతుగా నిలిచింది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం ఎదుట కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. వారి సమ్మె నాలుగో రోజుకు చేరిన సందర్భంగా శుక్రవారం అంగన్వాడీల సమ్మె శిబిరం నుంచి మునిసిపల్ వర్కర్స్ సమ్మె శిబిరం వరకు ర్యాలీ నిర్వహించి వారికి మద్దతుగా శిబిరంలో బైఠాయించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎవిఎస్ కుమారి, షేక్. హుస్సేన్ వలి, కె బాబు ప్రసాద్ ప్రసంగించారు.

ప్రజాశక్తి మంగళగిరి : కార్పొరేషన్ విలీన గ్రామాల్లోనూ, పలుచోట్ల అధికారులు కార్మికులను బెదిరించడం జరిగింది. దీంతో శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. న్యాయమైన మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. కార్మికుల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, ఎం రవి మాట్లాడుతూ అధికారులు కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అడిషనల్ కమిషనర్ కే హేమమాలిని కార్మిక నాయకులతో చర్చలు జరిపారు. ఎక్కడైనా అధికారులు అలా చేసి ఉంటే సరి చేసుకుంటామని తెలిపారు. సమ్మె చేసుకునే హక్కు ఉంటుందని అన్నారు. దీంతో ముట్టడి కార్యక్రమాన్ని విరమించారు. నాలుగో రోజు రాష్ట్ర వ్యాప్త పిలుపుల భాగంగా మెడకు ఉరివేసుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి శ్రీరాములు, ఎం బాలాజీ, యూనియన్ నాయకులు వై నాగేశ్వరరావు, పి పూర్ణ, కే ఏసు, ఎం నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడి సానుకూలంగా స్పందించాలని రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఎర్రబాలెంలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఉరి తాళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ఏమాత్రం శ్రద్ధ ఉన్న మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం అంగీకరించాలని కోరారు. ఎంటిఎంసీలోని విలీనమైన గ్రామాలలో కొందరు కార్యదర్శులు, సూపర్వైజర్లు, అతిగా వ్యవహరిస్తున్నారని కార్మికులను పనిలో నుండి తొలగిస్తామంటూ బెదిరింపుల కు దిగుతున్నారని ఇటువంటి బెదిరింపులు మానుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని రవి హెచ్చరించారు.



మంగళగిరిలో



ఎర్రబాలెంలో



తెనాలిలో



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం అభిమాని పులిపాటి ఏడుకొండలు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణానికి చెందిన సిపిఎం అభిమాని, చేనేత కార్మికుడు పులిపాటి ఏడుకొండలు (64)అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణంలోని వడ్డవల్లిలో నివాసం ఉంటున్న పులిపాటి ఏడుకొండలు చేనేత కార్మికునిగా జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఏడుకొండలుకు ఏడాదిన్నర క్రితం నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం పట్టణ కమిటీ బృందం శుక్రవారం ఉదయం ఏడుకొండలు భౌతిక కాయాన్ని సందర్శించి పార్టీ జెండాను కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏడుకొండలకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఏడుకొండలు అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం జరిగాయి. ఏడుకొండలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, అనుముల వీర బ్రహ్మం, కట్టా శివ దుర్గారావు,ఎం హరిపోతురాజు, మామిడి జగన్నాధ రావు, పంతంగి ప్రభాకర్, అనుముల రామయ్య, పులిపాటి రామారావు ఉన్నారు.



అనాధాశ్రమంలో సూర్య మండలం మోడల్

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని చెంఘిజ్‌ఖాన్‌పేట పంచాయతిలోని గోపాలపురంలో ఉన్న బాస్ చిల్డ్రన్స్ హోమ్‌లో ఖాళీ స్థలంలో సూర్య మండలం మోడల్ వేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ రైతులందరూ ఖాళీ స్థలాల్లో, ఇంటి పెరట్లో ఈ సూర్య మండలం మోడల్ వేసుకుంటే 365 రోజులు ఏడు రకాల ఆకుకూరలు, ఏడు రకాల కూరగాయలు, దుంప జాతి, అలాగే తీగ జాతి, పండ్ల మొక్కలన్నీ కూడా రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.శివాని హెల్త్, న్యూట్రిషన్ ఎన్ఎఫ్ఎఫ్, డిఎంఎంటిటి నరసింహా రావు, ఐసిఆర్పి ఎ.సుభాషిణి, భారత అభ్యుదయ సేవా సమితి వసతి గృహం మేనేజర్ జోసెఫ్ అంతోని పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో తనిఖీ

ప్రజాశక్తి- నూజెండ్ల

మండలంలోని ముక్కెళ్లపాడులో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను నూజెండ్ల మండల ఎంపీడీవో తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఏర్పాట్లుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మండలంలోని చింతలచెరువులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు ఈ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

‘విద్యా దీవెన’తో పల్నాడుకు రూ.26.64 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం బహిరంగ సభ నుంచి శుక్రవారం జగనన్న విద్యా దీవెన పథకం కింద జూలై, సెప్టెంబర్ - 2023 త్రైమాసికానికి సంబంధించి 8,09,039 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ రూ.584 కోట్లను బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో నేరుగా జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి ఓబులనాయుడు , డిటిడబ్ల్యూఓ వరలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు పల్నాడు జిల్లాలో జగనన్న



మెగా చెక్కు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

విద్యా దీవెన పథకం కింద జూలై, సెప్టెంబర్ - 2023 త్రైమాసికానికి సంబంధించి 33,159 మంది విద్యార్థులకు రూ.26.64 కోట్ల లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా నిధులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

భార్గవి హాస్పిటల్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి- మాచర్ల

స్థానిక రామటాకీస్ లైన్‌లో భార్గవి హాస్పిటల్ నూతన భవన ప్రారంభోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, పల్నాడు జిల్లా వైసిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, హాస్పిటల్ నిర్వాహకులు కటకం నాగేశ్వరరావు, డాక్టర్ కేపీ చారి, మద్దికర బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పిన్నెల్లితో ఆసుపత్రి నిర్వాహకులు

దేశవరపు క్యాంపు తండాలో విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక దేశవరపు క్యాంపు తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ మాతా జగదాంబ,సేవాలాల్ మహారాజ్, అభయాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ ఈ ఆలయాన్ని రూ.25 లక్షలతో నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజన తండాల్లో అన్ని సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశవరపు క్యాంపు తండాలో వీధి దీపాలు, తాగునీటి సమస్యపై స్థానికులు తనకు వివరించారని, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి కమిటీ సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, వైసిపి నాయకులు బూడిద శ్రీనివాసరావు, రిటర్డ్ డి ఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే మునలయ్య,శ్రీనివాసరావు,హాతీరామ్ నాయక్,దూప్ సింగ్, సంతవరపు లక్ష్మీ నారాయణ,మస్తాన్ పాల్గొన్నారు.

దోచుకున్న నిధులను తిరిగి చెల్లించాలి

జిల్లా టిడిపి అధ్యక్షులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను అభివద్ధి చేయాల్సిన సీఎం వేలకోట్ల పంచాయతీ నిధులను దోచుకొని అభివృద్ధికి తూట్లు పొడిచారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అవ్వరు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం-పంచాయతీ రాజ్ ఛాంబర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. అనంతరం మీడియాతో ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మౌలిక వసతుల కల్పన కేంద్ర ప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా విడుదల చేసిన 8600 కోట్ల నిధులను రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డి సి ఎఫ్ ఎం ఎస్ ద్వారా లాగేసుకొని దోచుకున్నాడంటూ విమర్శించారు. (ఎంఎన్ఆర్ఇజిఎస్) ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్రం గ్రామీణ అభివృద్ధికి రూ. 36 వేల కోట్లు విడుదల చేస్తే ఆ నిధులను కూడా జగన్ రెడ్డి దోచుకున్నాడని ఆరోపించారు. అసమర్థ వైసిపి పాలనలో పనులు చేస్తే బిల్లులు రావు అనే భయంతో టెండర్లు పిలిచిన కాంట్రాక్టర్లకు ముందుకు రాని పరిస్థితి దాపురించిందన్నారు.

కరెంటు బిల్లుల సాకుతో వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దోచుకున్న వేలకోట్ల పంచాయతి నిధులను వెంటనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలకు విలువ లేకుండా చేస్తూ, పంచాయతి నిధులను స్వాహా చేసి కోట్ల మంది ప్రజల జీవితాలతో చెలగాట మాడా రన్నారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కె.శ్రీని వాసులు, ఎం. శివ శంకర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 12,670 గ్రామ పంచాయతీలకు రూ.8,600 కోట్లు ఆర్థిక సంఘం



ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం-పంచాయతీ రాజ్ ఛాంబర్ సమావేశంలో మాట్లాడుతున్న జివి ఆంజేయులు

నిధులు విడుదల కాగా సర్పంచుల సంతకాలు లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు డ్రా చేసి గ్రామాల అభివృద్ధిని అడ్డుకుందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో జనవరి 3వ తేదీన విజయవాడలో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ సమా వేశానికి రాష్ట్ర అఖిలపక్ష పార్టీ నేతలు హాజరవు తున్నారని, 16 అంశాలతో కూడిన డిమాండ్లను వారి ముందు ఉంచనున్నట్లు చెప్పారు. అనంతరం విను కొండ నియోజకవర్గం సర్పంచుల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో టిడిపి నాయకులు, జడ్పిటిసి పి.హైమావతి. డిఎల్డిఏ చైర్మన్ ఎల్. వెంకటరావు, జి.శ్రీనివాసరావు, జి.సాంబశివరావు, పి.నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న పి రవికుమార్ సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందారు. అనంతరం అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు సందర్భంగా కార్యాలయ సిబ్బంది అభినందించారు.

క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం : మంత్రి అంబటి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక శరభయ్యక్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు ఆయన బౌలింగ్, బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి



క్రికెట్ జట్టుతో మంత్రి అంబటి రాంబాబు

మాట్లాడుతూ యువకుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిలో క్రీడా నైపుణ్యాలను మెరుగు పరచి జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దటం కోసమే ‘ఆడుదాం ఆంధ్రా’ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చియార్డు చైర్మన్ రాజనారాయణ పాల్గొన్నారు.



‘ఆడుదాం ఆంధ్ర’ను ప్రారంభించిన పిన్నెల్లి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విజయపురిసౌత్ లోని జింఖానా గ్రౌండ్ లో విజయపురిసౌత్, చింతల తండ,నాగులవరం సచివాలయం పరిధిలో నిర్వహించే ‘ఆడుదాం ఆంధ్ర’ను వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్స్, వాలీ బాల్స్, షటిల్ బ్యాట్ లను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి గబ్రు నాయక్,ఎంపీడీవో సరోజినీ దేవి, వైసిపి నాయకులు బూడిద శ్రీను, పంచాయతీ సెక్రటరీ దస్తగిరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు మోడల్ టెస్ట్ పేపర్ అందజేస్తున్న రాఘవ,వెంకట్రావు

మోడల్ టెస్ట్ పేపర్స్‌తో మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి-ఈపూరు

మోడల్ టెస్ట్ పేపర్స్ సాధన చేయడం ద్వారా పదవ తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని గంగినేని ఫౌండేషన్ నిర్వాహకులు గంగినేని రాఘవ అన్నారు. మండలంలోని కొచ్చర్ల,కొండ్రముట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్స్ ను ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత రాఘవ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన ఉంటుందని విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యను అభ్యసించి భవిష్యత్తులో వివిధ రంగాలలో రాణించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ మోడల్ టెస్ట్ పేపర్స్ విద్యార్థులకు మేలు చేస్తాయన్నారు.

యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ వినుకొండ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో సుమారు 2,400 పుస్తకాలను ఉచితంగా దాతల సహకారంతో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా డిఎల్ డీఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, కొచ్చర్ల ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఏ సుబ్బారావు, సిహెచ్ మల్లికార్జునరావు, మహమ్మద్ పఠాన్ ఖాన్, పి రమేష్ బాబు, పి.కిరణ్ బాబు, రంగనాథ్, ఫౌండేషన్ సభ్యులు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

సాధికార బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-తాడికొండ

నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో శనివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పా ట్లను శుక్రవారం ప్రత్తిపాడు శాసనసభ్యులు నియోజక వర్గ ఇన్‌ఛార్జి మేకతోటి సుచరిత, ఎంపి అయోధ్య రామిరెడ్డి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి మేకతోటి దయాసాగర్ పరిశీలించారు అడ్డరోడ్డు నుండి తాడికొండ వరకు ర్యాలీ జరుగనున్న నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు హాజరవుతున్న నేపథ్యంలో కట్టుదిటమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు అలాగే నియోజవర్గం నుండి అధిక సంఖ్యలో డాక్రా మహిళలు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

1న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఓవర్ బ్రిడ్జిక్రింద, పోలీస్ క్లబ్ రోడ్డు, ఆర్పిఎఫ్ బ్యారెక్స్ వద్దగల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కోసం క్యాన్సర్ వ్యాధిపై జనవరి 1న ఉచిత అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు బైసాని కైలాసనాథ్, కార్యదర్శి వి.రాంబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి క్యాన్సర్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ ఈ వైద్య శిబిరంలో పాల్గొని సీనియర్ సిటిజన్స్ క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రసంగిస్తారని, నగరంలోని సీనియర్ సిటిజన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని వినియోగించుకోవాలని కోరారు.



ఫిబ్రవరి 29న సగరుల బహిరంగ సభ

ప్రజాశక్తి-మంగళగిరి

భగీరథ జన్ కళ్యాణ్ బస్సు యాత్ర శుక్రవారం మంగళగిరి గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకుంది. స్థానిక గంగా భగీరథ సగర సంఘం నాయకులు బస్సు యాత్రలోని బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర బృందాన్ని సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ట్రస్ట్ నేషనల్ కోఆర్డినేటర్ హరీష్ చౌహాన్ మాట్లాడుతూ దేశంలో వివిధ పేర్లతో పిలవబడుతున్న సగరులను సంఘటితం చేసి, సగరులను సగర భగీరథ అనే ఒకే పేరుతో పిలవాలని కోరుతూ ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 29న శ్రీ సగర భగీరథ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో జరగనున్న సగరుల బహిరంగసభను జయప్రదం చేయా లని కోరుతూ ఈ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. సగరులు ఈ బహిరంగసభకు భారీగా తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షులు పి.సాంబశివ రావు, నాయకులు జె.ఏడుకొండలు, కె. శివసత్యనారాయణ, డి.రామ కోటేశ్వరరావు, కె.వెంకయ్య, కె.విష్ణుమూర్తి, జి.అచ్చయ్య, ఎన్. ప్రసాద్, కె.శ్రీనివాసరావు, జి.హేమకుమార్ పాల్గొన్నారు.

20న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం

ప్రజాశక్తి-మంగళగిరి

2024 జనవరి 20వ తేదీన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి బ్రాంచ్ సర్వసభ్య సమావేశం లిటిల్ విలేజ్ హొటల్లో మినీ మీటింగ్ హాల్లో ఉదయం 11 గంటలకు జరుగుతుందని సొసైటీ చైర్మన్ ఐ అనిల్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. గౌరవాధ్యక్షులు జివి రాంప్రసాద్ అధ్యక్షత వహిస్తారని, సభ్యులందరూ పాల్గొనాలని తెలిపారు.

8వ తేదీ వరకూ విధుల బహిష్కరణ

- జిల్లా బార్ ఫెడరేషన్స్ నిర్ణయం
- కొత్త భూహక్కు చట్టం రద్దుకు డిమాండ్

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు జిల్లా వ్యాప్తంగా కోర్టు విధులను శుక్రవారం వరకూ బహిష్కరించి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 బార్ అసోసియేషన్ల అధ్యక్షులు గుంటూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగించే ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ చట్టం వల్ల వివాదాలు మరింతగా పెరుగుతాయని ఆందోళన వెలిబుచ్చారు. రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రజలకు చిన్న సమస్య వచ్చినా దాని పరిష్కారం కోసం నెలలు, ఏళ్ల తరబడి అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. తాజాగా భూ హక్కు చట్టం అమలునూ రెవెన్యూ శాఖకు ప్రభుత్వం అప్పగిస్తోందని, ఇదే జరిగితే భూ సమస్య వచ్చిన ప్రజల అవస్థ ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే ఆందోళనగా ఉందని అన్నారు. ఈ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని నీతి ఆయోగ్ సూచించగా ఏ రాష్ట్రమూ అందుకు సిద్ధమవలేదని, ఆంధ్రప్రదేశ్‌ను మాత్రం ఒక ప్రయోగశాలగా మారిందని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవికె సురేష్

ప్రమాదకరమైన ఈ చట్టాన్ని రద్దు చేసే వరకూ తాము పోరాడ తామని, అందులో భాగంగా విధుల బహిష్కరణను 8వ తేదీ వరకూ కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు తీర్మానాన్ని జిల్లా బార్ ఫెడరేషన్స్ ఆమో దించింది. 8వ తేదీన మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని జిల్లా బార్ ఫెడరేషన్స్ చైర్మన్ కెవికె సురేష్ వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ నూతన కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

అర్హులైన ప్రతి ఒక్కరూ వారి కుటుంబంలో రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలను పొందవచ్చని చేబ్రోలు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.అబ్రహం లింకన్ అన్నారు. శుక్రవారం చేబ్రోలులో నూతనంగా ప్రభుత్వం ఇస్తున్న ఆరోగ్యశ్రీ కార్డు, ఆరోగ్యశ్రీ సేవల గురించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న తహశీల్దారు కె.వి గోపాలకష్ణ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ కార్డు పొందాలని, ఎలాంటి అవినీతికి తావు లేకుండా



కార్డులు పొందవచ్చని మధ్యవర్తులు ఎవరినీ నమ్మి మోసపోవద్దని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ ఆరో గ్యశ్రీ కార్డు అందని వారు గ్రామ సచివాలయంలో లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లేదా తహశీల్దార్ కార్యాలయంలో కానీ సం ప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యా ధికారులు డాక్టర్ అబ్రహం లింకన్, డాక్టర్ బాబురావు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆందోళన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం తుళ్లూరులోని బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్ర వారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. జనవరి 6 న నాగార్జున యూనివర్సిటీ వద్ద విద్యార్థులు తలపెట్టిన సదస్సుకు విసి రాజశేఖర్ అనుమతి నిరాకరించటాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు గతంలో అనేక సంఘాలకు అనుమతి ఇచ్చిన విసి, సదస్సుకు అభ్యంతరం చెప్పటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద వెంకటేశ్వరరావు, పి.రాజారావు, కె.వెంకటేశ్వర్లు, పి.థామస్, రాజారావు పాల్గొన్నారు.



బేకింగ్ పదార్థాల తయారీపై కెఎల్‌యులో పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలోని మహిళా అభివద్ధి ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు బేకింగ్ పదార్థాలు కేక్‌లు, బ్రెడ్లు, బిస్కెట్ల తయారీపైన శుక్రవారం నాడు పోటీలను నిర్వహించారు. ఈ పోటల్లో వర్శిటీలోని పలు విభాగాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని వివిధ రకాల కేకులు, బ్రెడ్లు, బిస్కెట్లను తయారు చేశారు. ఫుడ్ టెక్నాలజీ విభాగ ఆచార్యురాలు డాక్టర్ హేమమాలిని, మహిళా డెవలప్మెంట్ ఫోరం కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య, పూర్వ విద్యార్థుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే సోని, బిఇఎస్ ఆచార్యురాలు కోనేరు శిరీషా, సిఎస్ఐటి ఆచార్యురాలు ప్రవీణా నూతక్కిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళా డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య మాట్లాడుతూ విద్యార్థులు బేకింగ్ ఆహార పదార్థాల తయారీలో మెలకువలు నేర్చుకోవాలన్నారు రానున్న కాలంలో బేకింగ్ ఆహార పదార్థాలకు మరింత గిరాకీ పెరగనుందని తెలియజేశారు. విద్యార్థినులు తయారు చేసిన ఆహార పదార్థాల ఎంతో రుచికరంగా ఉన్నాయని ఆమె కితాబిచ్చారు. అనంతరం మొజిటో మాజిక్ కప్ కేక్ తయారు చేసిన దీప్తి చంద్రిక, బి.ఆదిత్యలకు ప్రథమ బహుమతి, గ్రేప్ కేక్ తయారు చేసిన సిఎస్ ఐటి విద్యార్థిని ఎం.విజయశ్రీ వర్ష, సిఎస్ఇ విద్యార్థిని పి.కీర్తిలకు ద్వితీయ బహుమతి, సిఎస్ఐటి విద్యార్థిని యు.అపర్ణ, సిఎఇ ఎస్కే.తన్వార్ లకు తృతీయ బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థినులను వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు అభినందించారు.



దీప్తి చంద్రికకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న కెఎల్ యు అధ్యాపకులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్. హనుమంతరావు సూచించారు. శుక్రవారం చిర్రావూరులో ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిచిల్ల చెట్లను వర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. జోనితిన్ మాట్లాడారు.



వ్యాపారవేత్తశివ నాగేంద్రానికి సత్కారం

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన మంగళగిరికి చెందిన ప్రముఖ చేనేత వస్త్ర వ్యాపారవేత్త కాండ్రు శివ నాగేంద్రరావును నేచర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. శుక్రవారం ఆయన నివాసానికి అసో సియేషన్ సభ్యులు వెళ్లారు. కర్నూలు డిఎస్ఎ స్విమ్మింగ్ పూల్ లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఆరవ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్-2023 రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శివనాగేంద్రరావు రెండు గోల్డ్ మెడల్స్, సిల్వర్, బ్రోంజ్ మెడల్స్ సాధించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఆర్కే మూర్తి

ముగిసిన యోగా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న యోగ శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ప్రిన్సిపల్ డాక్టర్ కె వెంకటరమణ అధ్యక్షతన జరిగిన శిక్షణలో యోగా శిక్షకులు ఎమ్మార్కే మూర్తి, టి.సుబ్బారావు విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యాంత్రిక జీవన విధానంలో ఒత్తిడిని అధిగమించేందుకు ముఖ్య సాధనం యోగా అని చెప్పారు. యోగాలో ఏకాగ్రత, ధ్యానం రెండూ ఉంటాయని ఫలితంగా మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శిక్షకులను కళాశాల యాజమాన్యం సత్కరించింది.



వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆనందబాబు

ప్రజాశక్తి-మంగళగిరి : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పారే పల్లి మహేష్ చేతుల మీదగా బీసీ సం క్షేమ సంఘం దుగ్గిరాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్గా ఉప్పాల ఆనందబాబును నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు.



ఉత్కంఠంగా ఎడ్ల బలప్రదర్శన

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

జాతీయ స్థాయిలో నిర్వ హిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన హోరాహోరీగా సాగాయి. మండల పరిధిలోని కొప్పురావూరులో జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి వృషభరాశుల బల ప్రదర్శనలు కొప్పురావూరు పిఎసిఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన శుక్రవారంనకు 3వ,రోజుకు చేరింది. 29న, వ్యవ సాయ విభాగం,30న, సబ్ జూనియర్స్, 31న, జూనియర్స్ విభాగంలోనూ, 1న, సీనియర్స్ విభాగంలోనూ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

జిఎంసికి రూ.53.89 లక్షల పన్ను వసూళ్లు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థకు ప్రస్తుత అర్థ సంవత్సరానికి సంబంధించిన శుక్రవారం ఒక్క రోజే రూ.53 లక్షల, 89వేల, 934లు వసూలు అయినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డీ లేకుండా ఆస్థి పన్ను చెల్లింపునకు డిసెంబర్ నెలాఖరుతో గడువు ముగుస్తున్నందున ప్రజలు ముందుగానే పన్నులు చెల్లించాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో షేక్ షబీనాకు బంగారు పతకం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డిసంబర్ 27 నుండి 29 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగిన అంతర్జాతీయ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ కళాశాల పూర్వ విద్యార్థిని షేక్ షబీనా బంగారు పతకం సాధించారు. ఎపి తరపున సబ్ జూనియర్ 84 కేజీలు విభాగంలో స్వర్ణం సాదించారని కోచ్ సంధాని శుక్రవారం తెలిపారు. స్క్వాడ్ విభాగంలో 170, బెంచ్ ప్రెస్ విభాగంలో 77.5, డెడ్ లిస్ట్ విభాగంలో 167.5, ఓవరాల్ గా 415 కేజీల బరువు ఎత్తి జాతీయస్థాయి రికార్డుతో బంగారు పతకాన్ని సాధించినట్లు ఆమె కోచ్ తెలిపారు. ఈ విజయంపట్ల సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శిలు సకల కోటేశ్వరరావు, ఎపి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శిలు మద్ది ప్రభాకర్, సూర్యనారాయణ తదితరులు షబీనాకు అభినందనలు తెలిపారు.


ఓవరాల్ ఛాంప్‌గా మొదటి స్థానంపై విజయకేతనం చూపిస్తున్న షబీనా


మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణప్రసాద్

కెఎల్‌పిలో ఉపాధి అవకాశాలపై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు అనే అంశంపై సమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యూరోసైన్స్ రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ ఎం.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం ప్రకారం భవిష్యత్‌లో విద్యార్థులు ఏపి పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నా సిబిఎస్ఇ సిలబస్ ప్రామాణికంగా ఉంటుందన్నారు. కావున కెఎల్‌పి పాఠశాల విద్యార్థులకు భవిష్యత్‌లో మంచి జీవితానికి పునాదిలాంటిదని చెప్పారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ స్పష్టమైన లక్ష్యం ఉండాలని, ఆ లక్ష్య సాధనకు దీక్షతో కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి, ఏఓ వెంకటరావు, నాగసుశీల విద్యార్థులు పాల్గొన్నారు.

మలినేని అధ్యాపకులు జిలానీకి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం అధ్యాపకులు షేక్.ఖాదర్ జిలానీ జెఎన్‌యుటికె నుండి డాక్టరేట్ పొందారు. జిలానీ 'డిజైన్ మరియు ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎఎంసి లోడెడ్ సిపిడబ్ల్యూ ఫెడ్‌వైడ్ బేండ్ ఏంటినా ఫర్ ఐఓటి అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సిద్దయ్య, జెఎన్‌టియుకె ప్రొఫెసర్ డాక్టర్ సత్య ప్రసాద్ ఇరువురూ జిలానీకి గైడ్‌గా వ్యవహరించారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డీన్.జె.కిషోర్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్ అభినందించారు.


జిలానీని అభినందిస్తున్న మలినేని పెరుమాళ్లు


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సైన్స్ ఫెయిర్‌లో జిల్లాకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-గుంటూరు

కడపలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గుంటూరు జిల్లాకు జట్టు విభాగంలో ద్వితీయ స్థానం లభించి, సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి సి.కె.జె.ఆర్సీ పాఠశాల విద్యార్థులు మల్టీ పర్పస్ వీల్ ఛైర్ అనే ప్రాజెక్ట్ ద్వారా ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జె.మహాలక్ష్మి, ఎస్.నాగ చైతన్యకు గైడ్ టీచర్ బి.టైటాస్‌కు డిఇఒ శైలజ, జిల్లా సైన్స్ అధికారి అడుసుమల్లి రవికుమార్ అభినందనలు తెలియజేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్సీ కెఎస్

గుంటూరు, పల్నాడు జిల్లాలో సమ్మెకు మద్దతు తెలిపిన ఆవాజ్, రైతు, కౌలురైతు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని కెఎస్ లక్ష్మణరావు శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలులో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 16వేల మందికిపైగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్నారని, ఈనెల 20 నుండి సమ్మెలోకి వెళ్లారని, ఈ డిమాండ్లకు పిడిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రధానంగా హెచ్ఆర్ పాలసీ ప్రకటించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో సమ్మెలో ఉన్నారన్నారు. విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి నాయకుల్ని చర్చలకు పిలిచి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్ష లో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులకూ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా వీరి సమస్యలను నిర్లక్ష్యం చేయటం వల్ల గత్యంతరం లేని కారణంగానే సమ్మెలోకి వెళ్లారన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఉద్యోగులు ఐక్యంగా ఉండి పోరాడాలని, పిడిఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. సమ్మెకు జనసేన రాష్ట్ర నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కనపర్తి శ్రీనివాసరావు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు సమ్మె శిబిరం వద్దకు వచ్చి ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. సమ్మె శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షులు బి లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు శివప్రకాష్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, కోశాధికారి గంగయ్య, నాయకులు కిరణ్ కుమార్, శివ పార్వతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు


నరసరావుపేట సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగులు కార్మికులు పోరాటాలు చేసి తమ హక్కులు సాధించుకోవాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ చిష్టి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ధర్నాచౌక్‌లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న నిరవధిక సమ్మెకు శుక్రవారం ఆవాజ్ రాష్ట్ర నాయకులు మరియు రైతు, కౌలు రైతు, ఇతర కార్మిక సంఘాల మద్దతు తెలిపారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ పాలకుల మాటలు నమ్మి రెగ్యులర్ చేయకపోయినా ఉద్యోగాలు అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా గౌరవ వేతనాలతో సరిపెట్టడం రిటైర్మెంట్ బెనిఫిట్ లేకుండా ఇంటికి పంపించడం వంటి కార్యక్రమాలకు ఇక మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ పంజాబ్, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల మాదిరి ఆంధ్రరాష్ట్రంలో కూడా విద్యా శాఖలో పనిచేసే సమగ్ర శిక్ష ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్, సిఐటియు నాయకురాలు గుంటూరు మల్లేశ్వరి తదితరులు మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ నిర్వహణ కోసం కేంద్రం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా కేటాయించకుండా వ్యవస్థను నడిపించాలని చూస్తుందని విమర్శించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష లో పనిచేసే 45 వేల మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామరావు, కార్మిక సంఘాల నాయకులు షేక్ సిలార్ మసూద్ , జి రవిబాబు తెలకపల్లి శ్రీను ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన జర్నలిజంపై దృష్టి సారించాలి

ఎపి మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

వర్సిటీలో డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నేటి ఆధునిక ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జర్నలిజం రంగం పై అవగాహన పెంచుకోవడంతోపాటు విలువలతో కూడిన జర్నలిజంపై దృష్టి సారించాలని వర్సిటీ విసి పి రాజశేఖర్, ఎపి మీడియా అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సి . రాఘ వాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. డైక్‌మెన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విసి రాజశేఖర్ మాట్లాడుతు రచనా శైలితో ఎన్నో అద్భుతాలు సాధించవచ్చన్నారు. జర్నలిస్టులకు ఆయా అంశాలపై కనీస అవగాహన ఉండాలని సూచించారు. సమాజాన్ని మార్చే ఏకైక ఆయుధం మీడియా అని ఆ మీడియాను సక్రమ పద్ధతిలో నడిపించగలిగేందుకు జర్నలిస్టులు ముందుకు రావాలని అన్నారు. అధికార భాషా సంఘం ఛైర్మన్ పి. విజయబాబు మాట్లాడుతూ ప్రజల జీవనస్థితిగతుల మెరుగుకు, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు మీడియా ఒక ప్రతినిధిగా ఉండాలన్నారు. నిరంతరం అధ్యయనం చేసే శక్తి జర్నలిస్టులు కలిగి ఉండాలని, వారు నిత్య చైతన్యవంతులుగా మారాలన్నారు. మీడియా రంగం అంటేనే ఒక బాధ్యతతో కూడిన కర్తవ్యంగా భావించాలని ఇది పవిత్రమైన వత్తిగా పేర్కొన్నారు. వారికి ఉద్యోగ విరమణ లేదన్నారు. అయితే వస్తున్న మార్పులు అవగాహన చేసుకుని నిరంతరం అధ్యయనం చేయాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో మీడియా రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మీడియా అకాడమీ ద్వారా ఎంతోమంది జర్నలిస్టులకు నైపుణ్యాలు పెంచేందుకు అవకాశం ఇచ్చిందన్నారు. అందులో భాగంగా పూర్తి స్వేచ్ఛ కలిగిన వాతావరణంలో జర్నలిస్టులకు డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సును నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్యూ జర్న లిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత, కోర్సు కోఆర్డినేటర్ ఎల్వి కృష్ణారెడ్డి, ఏఎన్యూ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, ద హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డెం అప్పాజీ, ఏఎన్యూ పరీక్షలు నిర్వహణ అధికారులు భీమిరెడ్డి నర్సారెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమం లో జర్నలిస్టులకు ప్రత్యేకంగా అడ్వాన్సడ్ సాఫ్ట్వేర్ టూల్స్ ఫర్ ఈ- పబ్లిషింగ్ అనే అంశంపై శిక్షణ తరగతు లను ప్రొఫెసర్ ఈ. శ్రీనివాసరెడ్డి నిర్వహిం చారు.


అభ్యర్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న విసి రాజశేఖర్,అకాడమి ఛైర్మన్ కొమ్మినేని తదితరులు